మద్యం చిచ్చుపై ఆగ్రహం

- నిబంధనలు ఉల్లఘింస్తున్న మద్యం దుకాణదారులు
- విచ్చలవిడిగా అమ్మకాలు
- రెచ్చిపోతున్న మందుబాబులు
- విసుగెత్తుతున్న ప్రజలు
- వారం రోజుల్లో రెండుచోట్ల ధర్నాలే నిదర్శనం


నందులపేటలో ధర్నా చేస్తున్న మహిళలు (ఫైల్)

తెనాలి: ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు, విచ్చలవిడి అమ్మకాలు, మందుబాబుల ఆగడాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏకంగా రోడ్డుపైకి వచ్చి ఆందోళనకు పూనుకుంటున్నారు. గత వారం రోజుల వ్యవధిలో తెనాలిలో ఇలాంటి ఘటనలు రెండుచోట్ల జరగడం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. గత ప్రభుత్వం అమలుచేసిన మద్యం విధానానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీ అమలులో నిర్లక్ష్యం ఫలితంగానే ప్రజలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. పట్టణ నందులపేట ఘంటావారి వీధిలో మూతబావి సెంటరులో గల మద్యం షాపునకు వస్తున్న మందుబాబుల ఆగడాలపై అక్కడి మహిళలు అదే షాపు ఎదుట టెంటు వేసుకుని మరీ ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. ఇళ్ల మధ్య రాత్రివేళల్లో అమ్మకాలు, మద్యం కోసం వచ్చే వారితో అక్కడ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. అర్ధరాత్రి మందులో కలుపుకునేందుకు నీటి కోసం, సమీపంలోని ఇళ్ల ముంగిట ఉన్న చేతి పంపుల దగ్గరకు వచ్చేస్తున్నారు. పెద్దపెద్దగా మాట్లాడుకోవడం, కేకలు, బూతుల పంచాంగంతో ప్రజలకు నిద్రా భంగం కలుగుతోంది. వీటికితోడు రెండుమూడు రోజుల క్రితం రాత్రి వేళ మద్యం తాగిన కొందరు యువకులు వైన్‌షాపు ముందే బాహాబాహీకి తలపడటంతో అక్కడంతా గందరగోళం నెలకొంది. జనం భయభ్రాంతులయ్యారు. ఇక లాభం లేదనుకుని శుక్రవారం ధర్నాకు దిగారు. దీనికిముందుగా గత నెల 30న ముత్యంశెట్టిపాలెం రోడ్డులోని సెంటరులో మద్యం షాపు ఏర్పాటు చేయడంతో అక్కడి మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. వాస్తవానికి ఆ షాపు, బుర్రిపాలెం రోడ్డులోని పాత రత్నా టాకీస్ పక్కన ఉండేది. అక్కడి కాంప్లెక్సులో విద్యాసంస్థ ఉందన్న కారణంగా అభ్యంతర పెట్టటంతో అదే మద్యం షాపును ముత్యంశెట్టిపాలెంలోని ఓ భవనంలోకి మార్చారు. ఇళ్లమధ్య మద్యం షాపేంటని స్థానికులు ఆందోళనకు దిగటంతో చేసేది లేక, మళ్లీ యథాస్థానానికి మార్చుకున్నారు. అక్కడ కూడా బహిరంగంగా మద్యం తాగడం నిత్యం కనిపించే దృశ్యం.


మద్యం దుకాణం ఎదుట మందుబాబుల బాహాబాహీ (ఫైల్)


ముత్యంశెట్టిపాలెంలో రోడ్డుపై బైఠాయించిన మహిళలు (ఫైల్)

గత పాలనలో పరిస్థితి వేరు

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైన్‌షాపులు నిర్ణీత సమయాలను కచ్చితంగా పాటించేవి. రాత్రి తొమ్మిది గంటల తర్వాత మద్యం విక్రయించేవారు కాదు. మద్యం కొనుగోలు చేసిన వారికి అక్కడ తాగేందుకు అనుమతి ఉండేది కాదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నూతన పాలసీని తీసుకొచ్చి లాటరీల ద్వారా మద్యం షాపులను కేటాయించారు. షాపులను దక్కించుకున్న లైసెన్సుదారులు యథేచ్ఛగా నిబంధనలను అతిక్రమిస్తున్నారు. రాత్రి పదిగంటలకు మూసేయాల్సిన మద్యం షాపుల్లో 11 గంటలకు కూడా అమ్మకాలు చేస్తున్నారు. ఆ తర్వాత కూడా బ్యాక్ డోర్ అమ్మకాలను తెల్లవార్లు కొనసాగిస్తున్నారు. షాపుల్లో మద్యం తాగేందుకు ఎలాంటి అనుమతి లేదు. అయినా సరే, కొనుగోలు చేసిన వారు అక్కడే తాగేస్తున్నారు. అవసరమైన మంచినీరు, గ్లాసులు, టచింగ్ పదార్థాలతో సహా షాపుల నిర్వాహకులే అందుబాటులో ఉంచుతున్నారు. ఫలితంగానే మందుబాబులు ఎప్పుడంటే అప్పుడు మద్యం షాపులకు వెళ్లటం, అక్కడే తాపీగా తాగేస్తున్నారు. మూకుమ్మడిగా వెళ్లినపుడు మాటామాటా పెరిగి బూతులు తిట్టుకుంటూ బాహాబాహీకి దిగుతున్నారు. నందులపేట వైన్‌షాపు వద్ద కొట్లాట ఆ క్రమంలో జరిగిందే. నందులపేటలో మందుబాబు ఆగడాలపై ధర్నా చేసిన మహిళలతో, ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు, మద్యం షాపుల్లో తాగకుండా ఆపేస్తామని కాకుండా, బహిరంగంగా తాగకుండా చూస్తామని హామీనివ్వడం కొసమెరుపు. మద్యం షాపుల నిబంధనల అతిక్రమణ వెనుకగల కారణాలు అందరికీ తెలిసినవే.

రూల్స్ అతిక్రమిస్తే ఉపేక్షించం

మద్యం షాపులు రూల్స్ అతిక్రమిస్తే క్షమించేది లేదు. నందులపేటలో మహిళలు ధర్నా చేసిన మద్యం షాపు దగ్గర ప్రత్యేకంగా ఓ కానిస్టేబుల్‌ను కాపలా ఉంచాం. మిగిలిన దుకాణాల్లోనూ పరిశీలించి, నిబంధనలను కచ్చితంగా పాటించేలా చూస్తాం.

– ఏవీ చలం, సీఐ, ప్రొహిబిషన్, ఎక్సైజ్, తెనాలి

చూసిన కనులదే భాగ్యం!

- ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం
- పలు దేవాలయాలను సందర్శించి పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో శ్రీరామనవమిని ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పట్టణంలో నవమి ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. భద్రాచలం తర్వాత తెనాలిలో జరిగే శ్రీరామనవి వేడుకలకు పూర్వకాలం నుంచీ అంతటి ప్రసిద్ధి ఉంది. ఇటీవల ఆ వైభవం తగ్గినప్పటికీ వేడుకలకు కొదవ లేదు. చలువ పందిళ్లు వేసి అట్టహాసంగా నిర్వహిస్తున్నారు.

- తెనాలి మార్కెట్ సెంటర్లో దొంగరాముడి గుడిగా పిలుచుకునే శ్రీ సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నవమి రోజున శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. కల్యాణోత్సవంలో కోగంటి ఫణికిశోర్, గీత దంపతులు పాల్గొన్నారు. విజయవాడకు చెందిన తిరుమల తిరుపతి దేవస్థాన విశ్రాంత సమన్వయకర్త, వ్యాఖ్యాత మండలిక శ్రీకృష్ణ కుమార్‌శర్మ ప్రత్యక్ష వ్యాఖ్యానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. సాయంత్రం శ్రీహనుమద్వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవాన్ని ఉభయదాతలు కిక్కూరి వెంకటేశ్వరరెడ్డి దంపతుల సహకారంతో నిర్వహించారు. యోగాచార్యులు కిశోర్ గురూజీ ప్రవచనం చెప్పారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యనిర్వహణాధికారి జీవీ అమరనాథ్, వ్యవస్థాపక ధర్మకర్త కోగంటి రాంబాబు పర్యవేక్షించారు.
- స్థానిక బోసు రోడ్డులోని హనుమాన్‌చౌక్‌లో గల శ్రీసీతారామ మందిరంలో నిర్వహిస్తున్న 93వ వార్షిక వసంత నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శ్రీరామనవమి రోజున శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. వేడుకల్లో దారా రవిశంకర్, శశికళ దంపతులు పాల్గొన్నారు. కల్యాణం పూర్తయిన తర్వాత శ్రీసీతారాముల వారి కల్యాణ తలంబ్రాలను భక్తులకు పంచిపెట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు.
- స్థానిక ప్రగడ కోటయ్యనగర్‌లోని శ్రీ సీతారామ మందిరంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. స్వామివార్లకు శేషవస్త్రాలు అందజేశారు.
- స్థానిక మారిసుపేటలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం (అప్పలస్వామి గుడి)లో ఆదివారం శ్రీ సీతారామ కళ్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు, పూజల్లో పాల్గొని స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. మర్రిపూడి వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం దంపతులు, మర్రిపూడి రాంబాబు, అనురాధ దంపతులు స్వామికి నూతన వస్త్రాలు, తలంబ్రాలు, మంచి ముత్యాలు సమర్పించి కల్యాణాన్ని నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్త లంక శివ ఆంజనేయప్రసాద్, దేవస్థాన సమన్వయకర్త విష్ణుభట్ల ఆంజనేయశాస్త్రి, అర్చకులు దినమని ధనుష్ సుబ్రహ్మణ్యశర్మ మహోత్సవాలను పర్యవేక్షించారు.
- స్థానిక హిందూ ముస్లిం రోడ్డులో శ్రీ రామనవమి ఉత్సవాల్లో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోలా వాసు నేతృత్వంలో ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణం వేడుకగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. శ్రీ సీతారాముల ఆశీస్సులతో ఈ ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి చెందాలని వ్యవసాయం, పాడిపంటలు, సుభిక్షంగా ఉండాలని, రైతులు ప్రజలు సంతోషంగా ఉండాలన్న ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు. అనంతరం రజకచెరువు దగ్గర్లోని శ్రీ సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో జరిగిన కల్యాణాన్ని శివకుమార్ తిలకించారు. స్థానిక కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి భక్తులు పాల్గొన్నారు. జగ్గడిగుంటపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వద్ద గల శ్రీసీతారామాంజనేయస్వామి దేవస్థానంలో పూజల్లోనూ శివకుమార్ పాల్గొన్నారు.


మార్కెట్ సెంటర్లోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో మంగళ సూత్రాలను చూపుతున్న అర్చకులు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కమనీయం సీతారాముల కల్యాణం

తెనాలిటౌన్: రూరల్ మండలంలోని గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి పండుగను వాడవాడలా ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. కఠెవరం గ్రామంలోని శ్రీ విఘ్నేశ్వర రామసాయి మందిరంలో ఏటా శ్రీరామనవమి అత్యంత వేడుకగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఉదయం 11 గంటలకు శ్రీ సీతారామస్వామి వార్ల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు జగదీష్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం, పానకం, వడపప్పు పంపిణీ చేశారు. 7వ తేదీ సోమవారం మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.


స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


బోసు రోడ్డులోని శ్రీ సీతారామమందిరంలో స్వామి కల్యాణం


తిలకిస్తున్న భక్తులు


అప్పలస్వామి గుడిలో పూజల్లో మాజీ ఎమ్మెల్యే శివకుమార్

క్లుప్తంగా

స్వచ్ఛంద సేవకు నూతన ఆటో ప్రారంభం



తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ యంగ్ జనరేషన్ టీమ్ సేవల కోసం సమకూర్చుకున్న నూతన ఆటోను ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. రానున్న రోజుల్లో సేవాకార్యక్రమాల నిర్వహణకు, నిరుపేద ప్రజలకు తక్కువ ధరలో సేవకు ఆటో అందుబాటులో ఉంటుందని సంస్థ అధ్యక్షుడు సాదిక్ తెలిపారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు కఠారి హరీష్, విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సయ్యద్ ఇర్షాన్, సాదిక్, నవీన్, శివ, యంగ్ జనరేషన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలి: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రైల్వేస్టేషను సెంటరులో పేదలకు అన్నదానం చేశారు. కేఎల్ఎన్ వారి అమ్మ ఫ్రూట్స్, మొవ్వా పున్నయ్య, సుహాసిని కుటుంబసభ్యుల సహకారంతో ఈ వితరణను చేశారు. 36వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన బ్రహ్మం, ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో మొవ్వా వెంకటశివయ్య, మహాలక్ష్మి, కరీముల్లా బాబు, విజయలక్ష్మి, అన్నదాత సుఖీభవ సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


శారద

తెనాలి రూరల్: ఆలయానికి వెళ్లిన వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కోగంటి రాంబాబు, శారద దంపతులు సుల్తానాబాద్ ఆలపాటి నగర్‌లో హోటల్ నిర్వహిస్తున్నారు. వైకుంఠపురం ఆలయానికి వెళ్లి వస్తానని శనివారం ఉదయం ఆరు గంటలకు ఇంటి నుంచి వెళ్లిన శారద తిరిగి రాలేదు. భర్త పోలీసులను ఆశ్రయించడంతో త్రీ టౌన్ ఏఎస్ఐ హైదర్ అలీ ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్ర గాయాలపాలైన ఘటన కొల్లిపరలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలోని హోలీ క్రాస్ స్కూలు వద్ద కేసన కోటేశ్వరమ్మ రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను కొల్లిపర వైద్యశాలకు తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర వైద్యశాలకు పంపారు. వాహనాన్ని మైనర్లు నడిపినట్టు సమాచారం. ఘటనపై కొల్లిపర పోలీసులు విచారిస్తున్నారు.

ఘనంగా దివ్య సత్ప్రసాద మహా పాదయాత్ర



మంగళగిరి టౌన్: జూబిలీ 2025 వేడుకల్లో భాగంగా గుంటూరు మేత్రాసనం, మంగళగిరి డీనరి ఆధ్వర్యంలో దివ్య సత్ప్రసాద ప్రభువునితో మహాపాదయాత్ర ఆదివారం మంగళగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురు మండల అధికారి ఫాదర్ ఎరువబాల మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో మొట్టమొదటి సారిగా ఈ దివ్య సత్ప్రసాద మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరిలోని డీనరి ఫాదర్స్, జేఎంజే సిస్టర్స్ ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. ఉదయం 6 గంటలకు మంగళగిరి మండల పరిధిలోని బేతపూడి డివైన్ మెర్సి చర్చి వద్ద నుంచి ఈ పాదయాత్ర మొదలై మంగళగిరి పట్టణ పరిధి పార్కురోడ్డులోని ఆర్‌సీఎం నిర్మల మాత దేవాలయ విచారణ సంఘస్తులను కలుపుకుని ఆత్మకూరు నిర్మల కాన్వెంట్ వద్దకు చేరుకుందని, అక్కడ నుంచి పెదవడ్లపూడి పునీత మిఖాయల్ పుణ్యక్షేత్రం వరకు చేరుకుందని వివరించారు. అనంతరం గుంటూరు జిల్లా పీఠాధిపతులు డాక్టర్ చిన్నబత్తిన భాగ్యయ్య వాక్యోపదేశం అందించి క్రైస్తవులకు దీవెనలు అందించారు. కార్యక్రమంలో డీనరి ఫాదర్లు, సిస్టర్లు, సంఘ పెద్దలు, ఉపదేశకులు, సహాయకులు పాల్గొన్నారు.

బీటీ రణదివేకు ఘన నివాళి

తాడేపల్లి రూరల్ : సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదివే 35వ వర్ధంతి వేడుకలను ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. రణదివే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1970 దశకంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని కార్మిక సంఘం ఏర్పాటుకు బీటీ రణదివే కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బి.ప్రభాకరరావు, బాబూరావు, వెంకటేశ్వర్లు, వెంకన్న, సూరి, అంకయ్య, నవనీతం, ఆశీర్వాదం, రమణ, వేణు, ఎస్‌కే జాని, సాంబయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారం తగదు

దుగ్గిరాల: వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో వ్యతిరేకంగా ఓటు వేసిన వైఎస్సార్ సీపీపై కొందరు కావాలని సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడం తగదని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ సుభాని అన్నారు. దుగ్గిరాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలిపిన టీడీపీపై మైనార్టీల్లో వ్యతిరేకత రావడంతో దిక్కుతోచని స్థితిలో వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి అసత్య ప్రచారాలు మానుకోకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో రషీద్ సాహెబ్, మస్తాన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు


మజ్జిగ పంపిణీ చేస్తున్న డాక్టర్ పావని ప్రియాంక, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సుజాత

తెనాలి అర్బన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ పావని ప్రియాంక, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి పేర్కొన్నారు. సాయిబాబా గుడి సమీపంలో శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కుర్రా శ్రీను మాట్లాడుతూ పది సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కుర్రా సుజాత, నాయకులు షేక్ మీరావలి, అవుతు రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఆర్‌కే శర్మ, షేక్ కాలేషా, పెసర్లంక రమణ, జశ్వంత్‌కుమార్, మహాప్రస్థాన సేవా సమితి ప్రతినిధి జెట్టి శివరామకృష్ణ, పాశం వెంకటేష్, షేక్ మౌలాలి, పోతురాజు, తుల్లిమిల్లి చంటి, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిస్టర్ లీమా

తెనాలి: స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదినం రోజైన ఆదివారం రూరల్ మండల గ్రామం కొలకలూరులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రేస్ ఫౌండేషన్, ఫార్చ్యూన్ రియల్టర్స్ సహకారంతో ఆ గ్రామ బీసీ కాలనీలోని జూబ్లీ హైస్కూలు ప్రాంగణంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ సిస్టర్ లీమా ప్రారంభించారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరాన్ని నిర్వహించారు. మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పటల్, విజయవాడ, తెనాలికి చెందిన న్యూక్లియర్ విజన్ ఆప్టికల్స్ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 150 మందికి పరీక్షలు చేసినట్టు నిర్వాహకులు వెల్లడించారు. నిర్వాహక సంస్థల అధిపతులు కన్నెగంటి మురళీకృష్ణ, కై తేపల్లి షాలేంరాజా, న్యాయవాది సుద్దపల్లి మురళీధర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో తోట నరేంద్ర, యడ్లపల్లి రవికిరణ్ పాల్గొన్నారు.

పేద ముస్లిం యువతుల వివాహానికి 'జెహెజ్' పంపిణీ


సామగ్రి అందజేస్తున్న చైర్మన్ ఖలీల్

తెనాలి: పట్టణంలోని చినరావూరుతోటకు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ డాక్టర్ జాఫర్ సాదిక్ బాషా ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మసీదు వీధిలో వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద కుటుంబాలకు చెందిన 16 మంది ముస్లిం యువతుల వివాహం నిమిత్తం అవసరమైన వధూవరుల నూతన వస్త్రాలు, బీరువా, మంచాలు, వంట పాత్రలు సహా పెళ్లి సామగ్రి (జెహెజ్)ని అందజేశారు. మున్నంగి, కొల్లిపర, దుగ్గిరాల, అంగలకుదురు, నందివెలుగు, పట్టణంలోని ఇస్లాంపేట, ఆర్‌ఆర్ నగర్, సీబీఎన్ కాలనీ, చినరావూరుతోట, టిడ్కో గృహాలకు చెందిన పెళ్లికూతుళ్ల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.50 వేల విలువైన సామాగ్రిని ట్రస్ట్ చైర్మన్ షేక్ ఖలీల్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ రియాజ్‌ఖాన్, ట్రస్ట్ కార్యదర్శి గౌసియాబేగం, సిల్వర్ వర్కర్స్ యూనియన్ నేత జిలాని ఖాన్, షేక్ రవూఫ్, హఫీజ్ షబ్బీర్, షేక్ జానీ బాషా, షేక్ నఫీజ్, షేక్ అబ్బాస్, డి.శ్యాం, లక్ష్మీనారాయణ, ఇనయతుల్లా, పి.రవి, దావూద్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితురాలికి నిత్యావసర సరుకులు పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి రాజశేఖర్

తెనాలి టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న కిడ్నీ వ్యాధి బాధితురాలికి శ్రీ ఆంజనేయ ధ్యాన యోగా మండలి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని 2వ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ కొనియాడారు. స్థానిక కొత్తపేటలోని విశ్వకర్మ దేవాలయ ఆవరణలో ఆదివారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా దేవస్థానం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. 2వ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ ప్రారంభించారు. అనంతరం కిడ్నీ వ్యాధి బాధితురాలికి నిత్యావసర సరుకులు అందజేశారు. రెండు కిడ్నీలు పాడై బాధపడుతున్న లలితకుమారికి ప్రతి నెలా 10కిలోల బియ్యం ధ్యాన యోగ మండలి ద్వారా అందజేస్తున్నట్లు కిశోర్ గురూజీ తెలియజేశారు. కార్యక్రమంలో దాతలు వీరయ్య, రాజారెడ్డి, వివేకానంద మూర్తి, యోగా సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, కోమలాదేవి, ఎం.శ్రీనివాసరావు, సూర్యనారాయణ, సుబ్బారావు, ఇస్మాయేల్, రాంబాబు, విద్యకుమారి పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నేతలు

తెనాలి టౌన్: పట్టణ, రూరల్ గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని పోలీసు క్వార్టర్స్ వద్ద బీజేపీ సీనియర్ నాయకులు అడపా సంపత్‌రాయుడు ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగురవేశారు. నెల్లూరు జిల్లా ఇన్‌ఛార్జి గాజుల వెంకయ్యానాయుడు పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని కొలకలూరు, అంగలకుదురు, గుడివాడ, సంగంజాగర్లమూడి, నందివెలుగు గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ కఠారి వాసుదేవనాయుడు జెండా ఆవిష్కరించారు. పార్టీ అభివృద్ధికి అవిరళ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కడియాల నందకిశోర్, తోటకూర కోటేశ్వరరావు, మందా జనార్దన్, వీరయ్య, కాలిశెట్టి రమేష్, బ్రహ్మయ్య, వెంకట్రావు, పలువురు నేతలు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి మనోహర్ జన్మదిన వేడుకలు


జనసేన కార్యాలయంలో కేక్ కటింగ్

తెనాలి అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను ఓఎస్‌డీ ఏసురత్నం, పార్టీ నాయకులు కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హరిదాసు గౌరి, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, బందారు రవికాంత్, షేక్ జాకీర్, బెల్లపు యశ్వంత్, హరికృష్ణ పాల్గొన్నారు.

- మనోహర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శ్రీ చక్ర ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని ఆసుపత్రి నిర్వాహకులు పర్యవేక్షించారు.

ఐక్యంగా పోరాడాలి

తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. ఆదివారంతో బ్రహ్మానందపురంలో కార్మికుల దీక్ష 124వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని దుర్గారావు తెలిపారు.